# తీరని కోరిక



ఆరోజు... ఆదివారం.

ఆదివారం నాడు నేను, నా మిత్రుడు ముకుందం, ప్రత్యేకంగా నెహ్రూ బజార్‌కి వెళ్ళడం అలవాటు. ఆరోజు కూడా ఇద్దరం కలిసే బజారుకి వెళ్ళాం. రద్దీగా ఉంది బజారు. ఆదివారం ఇలా ఉండటం సహజమే.

మాకు కావల్సిన కూరలు కొనుక్కుని, గేటు దాటి బైటికి వచ్చాం. కొస్తంత దూరంలో అమ్మకానికి పెట్టిన సోఫాలు, కుర్చీలు, టేబుల్లు కనిపించాయి. "అక్కడేవో సామాన్లు అమ్మకానికి పెట్టినట్లున్నారు. ఓ సారి చూద్దాం పద బ్రదర్..." అన్నాడు ముకుందం. "పదండి బ్రదర్" అంటూ అతణ్ణి అనుసరించాన్నేను.

నాలుగు రంగుల్లో సోఫాలు, కుషన్ కుర్చీలు, రెండు చిన్న టేబుళ్ళు, అక్కడున్నాయి. వాటిలో మా ఇద్దర్నీ ఆకర్షించింది, ఓ కుషన్ కుర్చీ. ఆ కుర్చీని, ప్రత్యేకంగా తయారు చేసినట్లుంది. వాలుకుర్చీ ఆకారంలో, వాలుగంగుళాల కుషన్‌తో ఏర్పాటు చేసిన ఆ కుర్చీని చూస్తుంటే అందానికి అందం, సుఖానికి సుఖం ఉన్నట్లనిపించింది. చాక్లెట్ రంగు రెక్సిన్ కవరుతో, ఎంతో ఆకర్షణీయంగా

అగుపిస్తోంది. నాకంటే, ముకుందరావుకె దాని పట్ల మోజు కలిగినట్టుంది.

"చాలా బావుంది కదూ బ్రదర్? విశ్రాంతి కోసం ఇలా అందులో చేరబడ్డామంటే, అనుకోకుండానే నిద్ర ముంచుకొస్తుంది. ఎంత సుఖంగా ఉంటుందో, ఎన్నాళ్ళనుంచో నాకో కోరిక ఉంది బ్రదర్. ఇటువంటి కుర్చీని స్వంతం చేసుకుని, తీరిక సమయాల్లో దాన్లో విశ్రాంతి తీసుకోవాలని..." అన్నాడు ముకుందం.

"అయితే, ఇంక ఆలస్యమెందుకూ, తీసేసుకోండి" అన్నాను, ప్రోత్సహిస్తూ.

ముకుందం నవ్వేశాడు. "అంత సులువుగా చెప్పొద్దు బ్రదర్! దీనికి బడ్జెట్ ఉండొద్దూ. అసలు, దీని ఖరీదు ఎంతో?"

"అడుగుదాం ఉండండి" అంటూ పక్కనే ఉన్న ఆ సామాన్ల యజమాన్ని అడిగాను.

"ఈ కుర్చీ ఖరీదు ఎంతండీ?" అని.

"రెండు వేలండీ, ప్రత్యేకమైన డిజైన్లో తయారు చేయబడిందండీ" అన్నాడతను.

"అబ్బో! అంత ఖరీదా!" ఆశ్చర్యపోతూ అన్నాను నేను.

"విన్నారా బ్రదర్. మనకి అందుబాటులో లేదు" నిరుత్సాహంగా అన్నాడు ముకుందం.

"అలా నిరుత్సాహ పడకండి సార్. దీని మీద మీకు మోజు ఉంటే, తీసుకోవాలనే బలమైన కోరిక ఉంటే, మీ అభిప్రాయం చెప్పండి. కొద్దో గొప్పో తగ్గుతుంది." అన్నాడు సామాన్ల యజమాని.

"ప్రస్తుతానికి, దీన్ని కొనే పరిస్థితిలో లేమండీ. కొద్ది రోజుల తర్వాత డబ్బు చూసుకుని ఆర్డరిస్తాంలెండి. ప్రతీ ఆదివారం ఇక్కడికి వస్తూ ఉంటారు కదా?"

"ఔనండీ. ప్రతి ఆదివారం వస్తాం"

"ఓ.కే వస్తామండీ" అంటూ వెనక్కి తిరిగాడు ముకుందం.

నేనూ అతణ్ణి అనుసరించాను.

"ఖరీదు అధికంలా ఉంది కదండీ, ముకుందం గారూ అన్నాను.

"అయినా, వస్తువు నాణ్యమైనది. నాణ్యత బట్టే కదా ఖరీదు. పదిహేను వందలకి ఇచ్చేయవచ్చు. ఎప్పుడో వీలు చూసుకుని కొందాం" అన్నాడతను.

ముకుందం, నేనూ ఉద్యోగ విరమణ చేసిన వాళ్ళమే. అయితే, నాకున్న బాధ్యతల బరువు అతనికి లేదు. అతనికి స్వంత ఇల్లుంది. పైగా సంతానం లేదు. అందుకే, ఆ కుషన్ వాలు-కుర్చీ కొనడానికి అతనికి స్తోమత ఉంది. ఎటొచ్చీ కావల్సింది వ్యవధే.

ముకుందంకి, ఆ కుర్చీ పట్ల మోజు రోజు రోజుకీ అధికమవుతోంది. పెన్షనులోనే, ప్రతినెలా కొద్దోగొప్పో వెనకేస్తూ వస్తున్నాడు. ఇంతలో ఓ శుభవార్త! డి.ఏ ఎరియర్స్ జనవరి నుంచి మంజూరు చేసినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఆ వార్త ముకుందంని మరింత ఆనంద పర్చింది. ఆ ఎరియర్స్ అందాక, ఆ వాలుకుర్చీని స్వంతం చేసుకోవాలని, ఓ నిర్ణయానికి కొచ్చేశాడు. కొన్ని ఖర్చులు తగ్గించుకుని అయినా, ప్రతినెలా పరికొంత వెనకేసి, చిరకాలంగా ఉన్న తన కోరిక తీర్చుకోవాలన్న పట్టుదల అతనిలో పాతుకు పోయింది. నాకు బాగా తెలుసు అతని పట్టుదల విషయం. తప్పకుండా అతని ఆకాంక్ష నేరవేరుతుందను కున్నాను.

కాని... కాని... విధి, విచిత్రమైనది. ఎప్పుడు ఎలా అది మనుషుల జీవితాలతో చెలగాటమాడు కుంటుందో, ఎవ్వరూ చెప్పలేరు. ఈ సారి ముకుందం నిండు జీవితంతో ఆడుకుంది.

సంపూర్ణ ఆరోగ్యవంతుడైన ముకుందం, ఎవ్వరూ కలలో కూడా ఊహించని రీతిలో, ఆ రాత్రి నిద్రపోయిన వాడు, మళ్ళీ సూర్యోదయాన్ని చూళ్ళేకపోయాడు. అందరూ విస్తుపోయారు. ఎంతో బాధ పడ్డారు. అతని ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోయి కొన్ని గంటలయ్యుంటుందని, తెల్లారి అతణ్ణి పరీక్షించిన డాక్టరు నిర్ధారించాడు.

నా ఆవేదనకి అంతులేకుండా పోయింది. పాపం, ఆ వాలు కుర్చీపై అతనికి ఏర్పడిన మోజు తీర్చుకోకుండానే, ఈ లోకాన్ని విడిచి పెట్టిన ముకుందం పట్ల, నాకెంతో జాలివేసింది. సానుభూతి కలిగింది. ఈ విషయం ఇంకెవ్వరికీ తెలీదు మరి! నాలో నేను, ప్రగాఢమైన నిట్టూర్పు విడవకుండా ఉండలేక పోయాను. పాపం, ముకుందం!... అనుకున్నాను మనసులోనే. చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకున్నాను. ●

**ముద్దంశెట్టి హనుమంతరావు**



## పారితోషికం విషయంలో లిబరల్

"ఇన్నేళ్ళ నా సినిమా జీవితంలో అనుకున్న పారితోషికం అనుకున్నంతగా ఇచ్చిన మొదటి చిత్రం "కాలేజీ బుల్లోడు" అని అక్కినేని ఆ మధ్య ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఆయనకు చాలా మంచి హృదయముంది. అలాంటి హృదయమే ఆయన తనయుడు నాగార్జునకూ ఉంది. నాగార్జునతో సినిమాలు తీసిన ఎక్కువ మంది నిర్మాతలు ఆ సినిమాలు విడుదలైన ఆరు నెలలకు పారితోషికం ఇచ్చారు. కొంత మంది అది కూడా ఇవ్వలేదు. దాని గురించి కూడా అంత ఇదిగా ఆలోచించని సహృదయుడు నాగార్జున. తను నటించే చిత్రం బడ్జెట్ పెరిగి బిజినెస్ అనుకున్న స్థాయిలో జరక్కపోతే ముందుగా అనుకున్న పారితోషికం నాగార్జున తగ్గించి తీసుకున్న సందర్భాలూ ఉన్నాయి. మరీ ఇంతటి విశాల హృదయం ఉంటే కూడా బావుండదేమో. ఎందుకంటే సినిమా ఇండస్ట్రీలో సోల్ ఈటర్స్ (ఆత్మను తినేసే వాళ్ళు) కూడా ఉంటారు.